# "ఒకటి మాత్రము నేనెరుగుదును"

# (9:6-41)

కొన్ని సార్లు "జవాబు వచ్చిన ప్రార్థనలు" మన జీవితాన్ని మిక్కిలి కష్టపెట్టవచ్చు. మన జీవితాలు మేలైనవిగా చేయబడతాయని మనం ఒప్పింపబడినవియు కొన్ని సార్లు అవి ఎక్కువ కష్టానికి గురి కావచ్చు. ఉదాహరణకు, లాటరీలో గెలుపొందేవారిని తీసికో, కొన్ని సంవత్సరాల క్రిందట లాటరీలో గెలుపొందినవారి కథను *New York Times Sunday Magazine*[1] ప్రచురించింది – వారు తమ జీవితాలను ఎలా బాధపరచుకున్నారో వివరించబడింది. లాటరీ గెలుపొందడం మిశ్రిత దీవెనగా ఉన్నట్టు వారు కనుగొన్నారు. ఆ డబ్బు అందమైన యిండ్లు, కార్లు కొనేలా ఉపయోగింపబడింది. కాని అది వారికి ఎదురు చూడని సమస్యలను కూడా తెచ్చిపెట్టింది.

లాటరీలో గెలుపొందిన ఎక్కువ మంది – అప్పులు కావలసిన దూరపు, దగ్గర బంధువులనుండి ఫోన్ కాల్స్, వారి అదృష్టానికి "పరిపూర్ణమైన" మూల ధనపు దాపరికానికి పన్నాగాలు చెప్పే ఆర్థిక సలహాదారులు, యింకా ఎక్కువైన అదృష్టపు కథలతో డబ్బు కావాలనే మనుష్యులనుండి తప్పించుకొనడానికే టెలిఫోన్ నంబర్లను జాబితాలోనుంచి తీసేసుకొంటారు. డోనాల్డ్ బ్లాక్లీ అనే ఒక ఎలక్ట్రికల్ ఇంజనీర్ 1982లో 42 లక్షల డాలర్లు లాటరీలో గెలుచుకున్నాడు. ఆ డబ్బును అతడు అనుభవించినా, అది తన బాంధవ్యాలను ఎలా మార్చివేసిందో దాని విషయమై అతడు దుఃఖపడ్డాడు. 2000 డాలర్లు బ్లాక్లీకి అచ్చియున్న ఒక స్నేహితుడు, ఆ అప్పును చెల్లించుమని అడిగితే బ్లాక్లీపై ఆగ్రహించుకున్నాడు. "42 లక్షలు ఉన్నవాడు 2000 అనే చిన్న అప్పును ఎందుకు అడగాలి?" అని అతని స్నేహితుడు ఆశ్చర్యపోయాడట. "డబ్బు పోగొట్టుకొనడం నాకు బాధగానే ఉంది, కాని స్నేహితుని పోగొట్టుకొనడం అంతకంటె ఎక్కువ బాధగా ఉంది" అని బ్లాక్లీ అన్నాడు. మొదట్లో, తన జత పనివారు తాను (లాటరీ) గెలుచుకున్నందుకు సంతోషించారు. ఆరు నెలల తరువాత వారి ఉల్లాసము అసూయగా మారింది, మరియు కాలక్రమంలో బ్లాక్లీ తన ఉద్యోగాన్నే వదలుకోవలసి వచ్చిందని అతడు చెప్పాడు. కొన్నిసార్లు "జవాబు వచ్చిన ప్రార్థన" జీవితాన్ని కష్టతరం చేయవచ్చు.

ప్రభువైన యేసు అంధుని కలిసికొన్న ఆ దినం అతని జీవితంలో బహు అద్భుతమైన దినమై ఉంది. ప్రతి అంధుడు చూపు కొరకు ప్రార్థించి యుండవచ్చు. తాను చూడగలిగితే ఏమి చేస్తాడో ఆ వ్యక్తి తరచుగా కలలు కంటూ ఉండవచ్చు. అప్పుడు, ఒకనాడు, ఏ విధమైన హెచ్చరిక లేకయే, ఒక మనుష్యుడు తన ముందుకు నడిచి వచ్చి సమస్తాన్ని మార్చివేశాడు. ప్రభువైన యేసు నేలమీద ఉమ్మివేసి బురద చేసి, ఆ బురదను వాని

కన్నుల మీద పూసి, సిలోయము అనే కోనేటిలో దాని కడుగుకొనుమని వానితో చెప్పాడు (9:6). యోహాను యిలా రిపోర్టు చేస్తున్నాడు, “వాడు వెళ్లి కడుగుకొని చూపు గలవాడై వచ్చెను” (9:7బి). ఆ అంధుని యొక్క మహా గొప్ప విన్నపాలు బదులివ్వబడ్డాయి! తన జీవితంలో ఆ దినము బహు కష్టతరమైనదై ఉంటుందని అతడు గుర్తించలేదు.

ఈ పాఠము యొక్క లేఖన భాగం, 9:6–41, విశ్వాస మార్గములో ఉన్నవాని కథను తెలుపుతోంది. ఈ కథను ప్రభువు ఆరంభించి, దాని అంతానికి తిరిగి వచ్చి చివరి దర్శకత్వాన్ని వివరణను యిస్తున్నాడు. ప్రాథమికంగా ఒకప్పుడు గుడ్డివాడైయున్న వానిమీద యిది కేంద్రీకరించబడి, యేసునందలి వాని విశ్వాసపు ప్రయాణం వైపు మళ్లుతుంది. ఆకర్షణీయంగా, ఈ లేఖన భాగము ఎదుగుతూ ఉండిన అతని విశ్వాసముచే మధ్య మధ్య నిలుపు చేయబడుతుంది.

## “నేనే అనెను” (9:6-9)

తన అంధత్వము పోగొట్టబడిన వెంటనే, నమ్మ శక్యము కాని ఆ సంభవాన్ని గూర్చి తన పొరుగువారు చర్చింపసాగారు. “వీడు కూర్చుండి భిక్షమెత్తుకొనువాడు కాడా” అని కొందరన్నారు (9:8). “వీడే అని కొందరును, వీడు కాదు, వీని పోలియున్న మరియొకడని మరి కొందరును అనిరి” (9:9). ఆస్పత్రిలో ఉన్న రోగియెదుట రోగియున్న సంగతి మరచిపోయి అతని గూర్చి మాట్లాడుకొంటున్న కుటుంబ సభ్యులను పోలి ఈ సంభాషణ ఉంది! “తాను ఎలాగున్నాడనుకుంటున్నావ్?” “ఈ రోజు అతడు కొంచెం ఫరవాలేదని అనుకుంటున్నా.” “అవునా, ఆ సంగతి నాకు నిశ్చయంగా తెలియలేదు.” “డాక్టరు ఏమన్నాడు?” “బ్రదుకుతాడని నీవు భావిస్తున్నావా?” (అన్నట్టు సంభాషణ కొనసాగింది).

చివరిగా, బాగుపడిన ఆ మనిషి తన పక్షంగా తానే మాట్లాడుకొంటూ, “నేనే” అని చెప్పాడు (9:9). అతడు తన్ను అలక్ష్యం చేయబడనియ్యడు. సంవత్సరాల తరబడి అతడు గుడ్డి భిక్షకుడైయున్నా, అతడు కొన్ని అంశాలపై నిపుణుడైనట్టున్నాడు, అందులో ఒకటి తన విషయమై తానే నిపుణుడు! తాను మునుపు గుడ్డివాడై ఉండి యిప్పుడు చూస్తున్నట్టు అతనికి నిశ్చయముగా తెలుసు. తాను ఎరిగిన దానిని గూర్చి అతడు ధైర్యముగా చెప్తూ “నేనే ఆ మనిషిని” అని అన్నాడు!

వ్యక్తులముగా మనలను మనమే ఎరగడంతో విశ్వాసపు యాత్ర మనలో ప్రతి ఒక్కనికి ఆరంభమౌతుంది. నీ విషయమై నీవే బాగుగా ఎరిగినవాడవు. నీవు ఒక వ్యక్తివని, జీవించు ప్రాణివని నీకు తెలుసు. శాస్త్రవేత్తలు నిన్ను గూర్చి ఒక సంగతి చెప్పవచ్చు, నీ అధికారి నిన్ను గూర్చి మరియొకటి చెప్పవచ్చు, నీ కుటుంబం యింకా వేరొకటి చెప్పవచ్చు. అయినప్పటికి, నీవు బ్రదికియున్నావని, నీవు ఆత్మ సంబంధమైన వ్యక్తివని, నీవు యింకను సంపూర్ణంగా పొందని ఒక దానికొరకు వెదకుతున్నావని నీకు తెలుసు. విశ్వాసపు యాత్రను మనం ఆరంభించేటప్పుడు, “నేనే ఆ మనిషిని!” అని ప్రకటించి ఆరంభిస్తాం.

## “యేసు బురద చేసి” (9:10-12)

దేవాలయ సమీపాన వారందరు చూచిన గుడ్డి భిక్షగాడు తానేయని చెప్పిన ఆ మనిషి యొక్క ప్రతిపాదన – అద్భుతముచే ఆరంభింపబడిన తికమకను తేటపరచలేక పోయింది. చిక్కు ప్రశ్నల ముక్కలు వారి మనస్సులో యింకా సరిగా కుదుటపడలేదు. ఆ దినాన, ఆ మాటకు వస్తే మరే దినానైనా, ఆలాటి అద్భుతం జరిగినట్టు వారు చూచియుండలేదు! ఈలాటి మహా గొప్ప వింత ఎలా జరిగిందని వారతనిని అడిగారు. సరళమైన నేరైన మార్గంలో, అతడు తన కథను యిలా చెప్పుకున్నాడు: “–యేసు అను నొక మనుష్యుడు బురద చేసి నా కన్నులమీద పూసి – నీవు సిలోయమను కోనేటికి వెళ్లి కడుగుకొనుమని నాతో చెప్పెను; నేను వెళ్లి కడుగుకొని చూపు పొందితిననెను” (9:11).

మరల, సమాజంలో ఏ అంతస్థుగాని, ఆస్తిగాని లేని ఈ మనుష్యుడు కొన్ని అంశాల మీద తాను అత్యంత నేర్పుగలవాడైనట్టు కనుపరచుకున్నాడు. తాను ఎవడైయున్నాడో తాను ఏమి అనుభవించాడో దాని విషయంలో ధైర్యముగలవాడైయున్నాడు. అలాగే, విశ్వాసపు యాత్రలో ఉన్న ప్రజలందరు తమ జీవితాలపై అనుభవశాలులై ఉన్నారు. “యేసును కలిసికొనక మునుపు నేను దుఃఖ పూరితమై యుంటిని” అని ఒకడు అనవచ్చు. “యేసు నన్ను విడిపించక ముందు నేను స్వాధీనం తప్పినవాడనై (లేక నిరాశలో, లేక త్రాగుడులో) ఉంటిని” అని మరొకడు చెప్పవచ్చు. ఈలాటి విషయాలను గూర్చి నీవు గొప్ప నిశ్చయతతో మాట్లాడవచ్చు. ఎందుకంటె నీవు గతంలో ఏమైయున్నావో, యేసు నీ కొరకు ఏమి చేశాడో అనేదాని విషయంలో నీకు నీవే బాగుగా ఎరిగిన వాడవైయున్నావు. ఎవడును నీ యొద్దనుండి దానిని తీసివేయలేడు.

## “ఆయన ఒక ప్రవక్త” (9:13-17)

గుడ్డివానిగా జన్మించిన వానితో పరిచయమున్న జనులకు అతనికి సంభవించిన కథను యింకా అయోమయంగానే ఉండిపోయి, మత సంబంధమైన నిపుణులగు పరిసయ్యుల యొద్దకు ఆ విషయాన్ని తెచ్చారు. యేసు అతని బాగుచేసిన దినము సబ్బాతు, యూదులకు అది పరిశుద్ధమైన విశ్రాంతి దినము. ఇది వారికి గొప్ప కష్టాన్ని సృష్టించింది. సబ్బాతు దినాన ఏ స్వస్థతనైనా అనుమానించే పరిస్థితిలో, తన కథను తిరిగి చెప్పుమని నిపుణులు అతనిని అడిగారు. వాడు అలా చేయగా, “–ఈ మనుష్యుడు విశ్రాంతి దినము ఆచరించుట లేదు గనుక దేవుని యొద్దనుండి వచ్చినవాడు కాడని” తీర్మానించారు (9:16). పరిసయ్యుల మనస్సులో ఈ విషయం సరిపోయి ఉండేదే, వారు ఈ స్వస్థతను వింతగా చూచారు లేక తెలిసికొనవలెనన్న వాంఛతో చూచారు. ఏదియెలాగున్నా, ఆ మనిషిని బాగుగా ఎరిగిన జనులకు మాత్రం పరిసయ్యుల జవాబు సంతృప్తికరంగా ఉండలేదు. దేవుని యొద్దనుండి వచ్చినవాడు కాకుంటే యింతటి గొప్ప అద్భుతం ఎలా చేయగలడు అంటూ వారు ఆశ్చర్యపోయారు.

పరిస్థితిని చర్చించడంలో ప్రజలు కొనసాగుతూ ఉండగా, “వారిలో భేదము పుట్టెను” (9:16). యోహాను సువార్త రచనయంతటిలో తన్నుగూర్చి ఒక తీర్మానానికి లేక

నిర్ణయానికి వచ్చునట్లు ప్రభువైన యేసు జనులను మానక నెట్టుతూ వచ్చాడు. తన్ను అలక్ష్యం చేయునట్లు ఆయన జనులకు అవకాశమియ్యలేదు. ఇవ్వబడిన రుజువులను పరిశీలించి ఆయన దేవుని యొద్దనుండి వచ్చాడో లేక అపవాది యొద్దనుండియే వచ్చాడో తీర్మానించుకోమని ఆయన నిర్బంధం చేశాడు. ప్రభువైన యేసుకును, యోహానుకును సంబంధించినంతమట్టుకు తటస్థపు స్థితి ఏదీలేదు.

తమ కలవరములో జనులు, తిరిగి గుడ్డివానిగా జన్మించిన వాని అభిప్రాయం ఈ విషయంలో ఏమైయుందో మరల అడుగవచ్చారు. విశ్వాస విషయంలో మరొక మైలు రాయిని దాటి, అతడు యిలా బదులిచ్చాడు: "ఆయన ఒక ప్రవక్త" (9:17). ఇలా చెప్పడంలో, గతంలో అంధుడైయున్నవాడు ఒక విషయాన్ని స్థిరపరచుతున్నాడు – అది తన విషయం కాదు, తన్ను బాగుచేసిన ఆయన విషయం. ఆ మనుష్యుడు దేవునినుండి శక్తి పొందినవాడైయున్నట్టు అతడు తీర్మానించాడు. ఎంతగా చెడ్డవాడైయున్నట్టు పరిసయ్యులు యేసును గూర్చి చిత్రింపబూనినా, గుడ్డివానిగా పుట్టినవాడు మాత్రం ఆయన మంచివాడని, దేవుని వద్దనుండి ఆయన శక్తి పొందెనని ఒప్పింపబడ్డాడు.

## "ఒకటి మాత్రము నేనెరుగుదును" (9:18-25)

గుడ్డివానిగా పుట్టినవాడు చేసిన ప్రతిపాదనతో ఉద్రిక్తత అధికమౌతుంది. యేసు దేవుని యొద్దనుండి వచ్చిన ప్రవక్తయన్న అతని విశ్వాసాన్ని పరిసయ్యులు సంపూర్తిగా నిరాకరించారు. అక్కడ కూర్చుండి భిక్షమెత్తినవాడు యితడేనన్న సంగతిని సహా కొందరు సందేహించారు. అందువలన, వారు అతని తల్లిదండ్రులను పిలిచి అతని విషయమై ప్రశ్నించారు. "గుడ్డివాడై పుట్టిన మీ కుమారుడు వీడేనా? ఆలాగైతే ఇప్పుడు వీడేలాగు చూచుచున్నాడని వారిని అడిగిరి" (9:19). అతని తల్లిదండ్రులు భయపడ్డారు. దృష్టి వారిమీద కేంద్రీకరింపబడడానికి వారు యిష్టపడలేదు. మరియు అక్కడ ఉత్పన్నమైన పరిస్థితియంతా వారిని భీతులనుగా చేసింది. ప్రభువైన యేసుకు అనుకూలంగా ఎవరు ఏమి చెప్పినా, వారిని సమాజ మందిరంలోనుండి వెలివేయమని వారు అంతకు మునుపే వినియున్నారు (9:22). వారి స్నేహితులు, కుటుంబము, జీవనాధారము పోతుందని ఎరిగిన వాని తల్లిదండ్రులు (వానిని భిక్షాటనకు విడిచినవారు) ఈ సంఘర్షణలో వానిని మరోసారి చేయివిడిచారు. "వీడు వయస్సు వచ్చినవాడు, వీనినే అడుగుడి; తన సంగతి తానే చెప్పుకొనగలడని వారితో అనిరి" (9:21). తమ కుమారునికి దృష్టి అనే వరము అనుగ్రహింపబడినందున అది వారికి మహా ఆనందకరమైన దినమైయుండవలసింది. దానికి బదులు అది వారికి భయమును అవమానమును కలిగించిన దినముగా అయ్యింది.

మరల, ప్రశ్నించేవారు ఆ మనిషివైపు తిరిగి తాను ఎలా యిప్పుడు చూడగలుగుతున్నాడో వివరించుమని అడిగారు. "దేవుని మహిమపరచుమని" వారు డిమాండ్ చేశారు. ఇది దేవుని ఆరాధన లేక స్తుతి చెల్లించడానికి సంబంధించినదేమీ కాదు. దానికి బదులు అది "సత్యం చెప్పు!"[2] అని అడిగే యూదుల విధానమైయుంది. తాను నేరం చేసినట్టు ప్రతివాదు ఎరిగినా, ఆ నేరాన్ని ఒప్పుకొని నేరస్థునితో మాట్లాడే తీరు అది. గుడ్డివానిగా పుట్టినవాని మీద పెరుగుతున్న వారి విసుగు, కోపము, అసహనము అనేవి వారి మాటల్లో సూచింపబడ్డాయి.

మనం ముందుగా చూచినట్టే, తన్ను ప్రశ్నించినవారికి ఆ మనుష్యుడు నెమ్మదిగాను, నిశ్చయమైన ధైర్యంతోను యిలా జవాబిచ్చాడు: "ఆయన పాపియో కాడో నేనెరుగను; ఒకటి మాత్రము నేనెరుగుదును; నేను గ్రుడ్డివాడనైయుండి ఇప్పుడు చూచుచున్నా ననెను" (9:25). మత సంబంధమైన చర్చలలోని అనేక పరిధులలో, అతడు నిలదొక్కుకొని ఉండగలిగినవాడు కాదు. అతడు భయపెట్టబడినప్పుడు, వాస్తవాల మీద అతడు తిరిగి పడిపోయాడు: "ఒకటి మాత్రం నేనెరుగుదును; నేను గ్రుడ్డివాడనైయుండి ఇప్పుడు చూచుచున్నాను."

## "ఈయన దేవుని యొద్దనుండి వచ్చినవాడు" (9:26-34)

గుడ్డివాడై పుట్టినవాని స్థిరమైన మొండి పట్టుదలచేత విసుగుచెందినవారై, పరిసయ్యులు ప్రశ్నించే విధానాన్ని పూర్తిగా తిరిగి క్రొత్తగా ప్రారంభించారు (9:26). కొన్ని సంవత్సరాల క్రితం విదేశీ విమానంలో నేను ఎదుర్కొన్న తీవ్రవాదుల విద్రోహ చర్యలను ప్రశ్నించిన పద్ధతి ఈ తంత్రంలో జ్ఞాపకం వస్తుంది. వైమానిక ఉద్యోగులు మాలో ప్రతి ఒక్కరిని ప్రక్కకు తీసికొని పోయి ప్రశ్నల వర్షాన్ని కుమ్మరించారు. అప్పుడు, కొన్ని నిమిషాల తరువాత, మరొక ఉద్యోగి అదే ప్రశ్నలను తిరిగి మమ్మును అడిగేవాడు. చివరిగా, మూడవ ఉద్యోగి అదే ప్రశ్నలను మరోసారి అడిగేవాడు! తరువాత, ఆ ముగ్గురు ఉద్యోగులు ఒక్కచోట నిలబడి వారి నోట్సు సరిపోల్చుకొంటూ మేము ఆ ముగ్గురికి ఒకే జవాబు యిచ్చామో లేదో చూచారు. ఆ దినాన మాకు కలిగిన భావనయే పుట్టు గ్రుడ్డివానికి కలిగి ఉండవచ్చు.

మరలా అదే ప్రశ్నలను ఎదుర్కొంటూ, ఆ పరిస్థితిలోనికి ఆ మనుష్యుడు కొంత వ్యంగ్యం ప్రవేశపెట్ట నారంభించాడు. యేసునందు తమకు యిష్టం కలిగి ఆయన శిష్యులై ఉండగోరినందున యూదా మత నాయకులు ఆయనను గూర్చి మరల అడుగుతున్నారా ఏమి అని అతడు వారినడిగాడు (9:27). ఎదురు చూడబడినట్టే, వారు కోపంతో మండిపడ్డారు. అప్పుడు, వారితో మాట్లాడే చివరి అవకాశం వానికి లభించినప్పుడు, పుట్టు గుడ్డివాడు, ఇశ్రాయేలు అంతటిలో మహా మేధావులై, ఉన్నతమైన తర్ఫీదుగల యోచన కర్తల వద్ద విరుద్ధ ఆలోచనలను సూచించాడు. పుట్టు గుడ్డివానిని బాగుచేసిన గొప్ప అద్భుతము వంటిది ఎవరును ఎన్నడును వినలేదని అతడు చెప్పుకున్నాడు. అది నిజముగా ఒక ఆశ్చర్యకరమైన కార్యమే! అయినా దేవునికి ఎంతో సమీపస్థులైయున్నట్టు చెప్పుకునే పరిసయ్యులకు యేసు ఎక్కడనుండి వచ్చాడో ఏమి చేశాడో తెలియక పోవడం ఆశ్చర్యమేనని అతడన్నాడు. అతని ధైర్యమైన తీర్మానమేమంటే, ఆయన దేవుని వద్దనుండి వచ్చినవాడు కానట్టయితే, అలాటి గొప్ప కార్యము చేయగలిగి యుండేవాడు కాడు అనేదే. "ఆయన దేవుని యొద్దనుండి వచ్చినవాడని" తన భావాన్ని అతడు తేల్చి చెప్పాడు (9:33).

పుట్టు గుడ్డివానివలన యిబ్బంది పెట్టబడిన పరిసయ్యులు మాటల తూటాలను పేల్చివేశారు. వారికి బోధించడానికి వానికి ఎంత ధైర్యం? అతడు ధర్మశాస్త్రాన్ని ఎరుగనివాడు, బాధ్యతాయుతంగా ఆలోచింపగలిగినట్టు నమ్మ వీలులేదు. పైగా, అతడు

సంపూర్ణంగా పాపంలోనే పుట్టాడని వారు ప్రకటించారు. (2 వచనంలోని పాపము, బాధ అనే విషయంలో శిష్యుల యొక్క ప్రశ్నను జ్ఞాపకం చేసికో.) మాటలతో అతని బాధించిన తరువాత, "వాని వెలివేసిరి" (9:34). తన తల్లిదండ్రులకు ఏమి సంభవిస్తుందని వారు భావించారో, అదే వీనికి సంభవించినట్టుంది; వారు అతనిని సమాజమందిరంలో నుండి తోలివేశారు.

యేసునందలి విశ్వాసం కొన్ని సార్లు పుట్టు గుడ్డివాని అనుభవంవలె చిక్కుగా (సంకటంగా) మారిపోవచ్చు. యేసు జీవితాన్ని అనుకూలంగా ఎల్లవేళలా చేస్తాడనే భావన మనకు ఎక్కడనుండి వచ్చింది? వెలుగు చీకటులు ఒకదాని వెనుక మరొకటి సౌఖ్య ప్రదంగా ఉండలేవు. విశ్వాసము కుటుంబాలను ఎల్లప్పుడు ప్రశాంతంగా ఉంచదు; కొన్ని సార్లు అది ఎక్కువ సంఘర్షణను కలిగిస్తుంది. విశ్వాసం ఎల్లప్పుడు వివాహాలను ఎక్కువ నిశ్చలంగా నిలుపదు; కొన్ని సంఘర్షణలకు అధికమైన మూలంగా ఉంటుంది. విశ్వాసం ఉద్యోగాన్ని ఎల్లప్పుడు ఎక్కువ తేలికగా చేయదు; కొన్నిసార్లు వ్యక్తి ఉద్యోగంలో నుండి తీసివేయబడతాడు. ప్రభువైన యేసు అప్పుడు యిలా అన్నాడు!

> నేను భూమిమీద సమాధానము కలుగజేయ వచ్చితినని మీరు తలంచుచున్నారా? కాదు; భేదమునే కలుగజేయవచ్చితినని మీతో చెప్పుచున్నాను. ఇప్పటినుండి ఒక ఇంటిలో అయిదుగురు వేరుపడి, ఇద్దరికి విరోధముగా ముగ్గురును, ముగ్గురికి విరోధముగా యిద్దరును ఉందురు. తండ్రి కుమారునికిని, కుమారుడు తండ్రికిని, తల్లి కుమార్తెకును, కుమార్తె తల్లికిని, అత్త కోడలికిని, కోడలు అత్తకును విరోధులుగా ఉందురని చెప్పెను (లూకా 12:51-53).

విశ్వాసం తెచ్చే కొన్ని యిబ్బందులను బట్టి, మనం వెనుకకు మరలేలా శోధింప బడవచ్చు. ఏదియెలాగున్నా, (ఒకటికంటె ఎక్కువైన మార్గాల్లో) పుట్టు గుడ్డివాడు వెలుగును చూచాడు. అతనికి యికను వెనుకకు తిరిగే ప్రసక్తే లేదు. తాను నమ్మింది ఏదో దాని విషయమై అతడు నిశ్చయం కలిగియున్నాడు. తాను సత్యంగా ఎరిగిన దానినుండి అతన్ని భయపెట్టగలవాడు ఎవడును లేడు.

## "నేను విశ్వసించుచున్నాను" (9:35-41)

త్వరలోనే అతనికి ఎంతో ఎక్కువ సంభవించింది! తన జీవితంలో మహా ఘనమైన దినంగా ఉండవలసింది, బహు వితర్కముతో కూడిందిగాను, ఖరీదైనదిగాను మారి పోయింది. అతడు తన చూపును పొందాడు, అయితే అతడు సమాజ మందిరంలో నుండి వెలివేయబడ్డాడు. చివరకు అతడు తన పొరుగు వారి ముఖాలు చూడగలిగాడు, కాని అతడు చూడగలిగిన ముఖాలు కోపంతోను కలతతోను నిండియున్న ముఖాలే. తన సమాజంలో అతనికి స్థానం లేకుండాపోయింది. ఎవరి మధ్య తాను భాగమై ఉండాలనుకున్నాడో వారు అతనిని గేలిచేసి శిక్ష విధించారు. అతని తలలో సందిగ్ధపు సుడులు తిరుగుతూ ఉండగా, ఎవరి స్వరం మాత్రమే పరిచితమై, ఎవరి ముఖం తానెన్నడు చూచియుండలేదో – ప్రభువుచే అతడు స్వాగతం పలుకబడ్డాడు.

మనుష్య కుమారునియందు అతడు నమ్మిక కలిగియున్నాడా అన్న ప్రశ్నను ప్రభువు అతనినడిగాడు. ప్రశ్నవలన తబ్బిబ్బై, తన్ను అడిగిన వానియందు నమ్మిక కలిగి, "ప్రభువా, నేను ఆయనయందు విశ్వాసముంచుటకు ఆయన ఎవడని" అతడు ప్రశ్నించాడు (9:36). తానే మనుష్య కుమారుడై ఉన్నట్టు యేసు చూపుపొందిన గుడ్డివానికి తెలిపాడు. అది విన్న వెంటనే – "ప్రభువా, నేను విశ్వసించుచున్నానని" చెప్పి ఆయనకు మ్రొక్కెను (9:38). తన విశ్వాసపు యాత్రలో అతడు మరొక రాయిని దాటాడు. "నేను విశ్వసించుచున్నానని" అతడు చెప్పగలిగాడు.

వివరింపబడిన కథలో, ఆ మనిషి యొక్క విశ్వాసపు పురోభివృద్ధిని గమనించు. "యేసు ఉమ్మితో బురద చేసి" పూయబడినవాడనే స్థితిలోనుండి, ("యేసు అనునొక మనుష్యుడు") అనే స్థితినుండి, "ఆయన ఒక ప్రవక్త," "ఒక సంగతి నాకు తెలుసు," "ఆయన దేవుని యొద్దనుండి వచ్చినవాడు," "నేను విశ్వసించుచున్నాను" అనేవరకు వచ్చాడు. ఒక్కొక్కసారి తాను ఏమి ఎరిగాడో దానిమీద ఆధారపడి అతడు ఒక్కొక్క అడుగు భద్రంగా వేశాడు. అతడు విశ్వాస విషయంలో ఎరిగిన దానిలోనికి ఎగిరి దుమకలేదు. అయితే క్రమముగా నిశ్చయమైన అడుగులతో విశ్వాసం వైపుకు అతడు పయనించాడు.

## ముగింపు

ప్రభువైన యేసు తన శిష్యులతో, "నేను లోకమునకు వెలుగును" అని చెప్పాడు (9:5బి). మన లోకము పాపము యొక్క అధికమైన అంధకారముచేత నింపబడింది. చీకటి వెలుగును సంహించలేదు. ఎందుకంటె, ఆ రెండును సంఘర్షణ పడతాయి. నీవు వెలుగు సంబంధివైయుంటే, అంధకార సంబంధమైన శక్తుల భయంకరమైన పోరాటంలో చిక్కుకొనియున్నట్టు నిన్ను నీవే కనుగొంటావ్! నిన్ను గూర్చి, జీవితాన్ని గూర్చి, ప్రభువైన యేసును గూర్చి నీవు ఎరిగిన దానిపై ఆనుకో. ఇలా చేయడంలో, ఒకవేళ ఉదయకాలం సూర్యుడే ఉదయించకపోయినా, నీవు ఎవరివో ఏమి విశ్వసిస్తున్నావో ఎరిగి ఉంటావ్!

తాను స్వస్థత పొందిన దినాన ఈలాటి సంఘర్షణ ఎదుర్కొంటాననే ఊహ పుట్టు గుడ్డివానికి కలుగనే లేదు. ఏదియెలాగున్నా, చూపు పొందడంలో ఉన్న యిబ్బంది యింతగా ఉంటుందని అతడు ఎరిగియున్నా అంధత్వం కంటె దృష్టినే అతడు కోరియుంటాడని నా నమ్మకం. యేసు నిజముగానే "లోకమునకు వెలుగైయున్నాడు." నేటి ఆహ్వానము ఆ వెలుగులోనికి రమ్మనేదే!

---

సూచనలు

[1]*New York Times Sunday Magazine*, 31 January 1993, xiii-NJ-4:6. [2]యెహోషువ 7:19 చూడు.